శనివారం 04-5-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 324, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## దేశంలో ఆడబిడ్డలు ఓడిపోయారు, ఆయన గెలిచాడు

### ప్రాణాలను పణంగా పెట్టి వ్యతిరేకంగా పోరాడాం • బ్రిజ్ భూషణ్ కుమారుడు టికెట్‌పై సాక్షి ఫోస్టు

**ముందడుగు జాతీయం:**

ఈ దేశ ఆడబిడ్డలు ఓడిపోయారు. బ్రిజ్ భూషణ్ గెలిచాడు. ఆయనకు వ్యతిరేకంగా మేమంతా మా కెరీర్‌లను పణంగా పెట్టి పోరాడాం. ఎండనకా.. వాననకా.. ఎన్నో రోజులు రోడ్లపై నిద్రించాం. అయినా ఆయనను ఇంతవరకు అరెస్టు చేయలేదు. మేం న్యాయం తప్ప ఇంకేం డిమాండ్ చేయట్లేదు. అరెస్టు విషయం పక్కనబెట్టండి. ఈ రోజు ఆయన కుమారుడికి ఎన్నికల్లో టికెట్ ఇచ్చారు. ఈ నిర్ణయంతో మీరు (భాజపాను ఉద్దేశిస్తూ) కోట్లాది మంది అమ్మాయిల మనోధైర్యాన్ని దెబ్బతీశారు. కేవలం ఒకే ఒక్క కుటుంబానికి టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉందంటే.. ఒక వ్యక్తి ముందు ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనపడిందా? శ్రీరాముడి పేరుతో ఓట్లు మాత్రమే కావాలా? ఆయన చూపిన బాటలో నడవరా?'' అని సాక్షి ప్రశ్నించారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌కు ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కైసర్‌గంజ్ స్థానంలో కుమారుడు కరణ్





భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపింది. ఈ ప్రకటనపై ప్రముఖ రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత సాక్షి మలిక్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ భావోద్వేగభరిత పోస్ట్ పెట్టారు. ఈ దేశ ప్రభుత్వం అంత బలహీనంగా ఒక్క వ్యక్తి ముందు లొంగిపోయిందా?అని నిలదీశారు.



జెడీ గెలుపు ఖాయం..?

వివరాలు 4లో

## కేజ్రీవాల్ బెయిల్ అంశంపై వాదనలు వింటాం

- విచారణకు సిద్ధమై రావాలని ఈడీకి ఆదేశం
- మే 7న విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం

**ముందడుగు ఢిల్లీ:**

లిక్కర్ కేసులో అరెస్టు అయినా అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ అంశంపై వాదనలు వింటామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇందుకు సంబంధించిన పిటిషన్‌ను మే 7న విచారిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు తెలిపింది. ఈక్రమంలో విచారణకు సిద్ధమై రావాలని ఈడీ తరఫు న్యాయవాదికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. 'ఈడీ అరెస్టుకు వ్యతిరేకంగా కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణను పరిశీలిస్తాం' అని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. దీనిపై స్పందిస్తూ.. మధ్యంతర బెయిల్ పిటి



షన్‌ను తాము వ్యతిరేకిస్తామని ఈడీ తరఫున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు పేర్కొన్నారు. దాంతో మరింత స్పష్టతనిచ్చిన ధర్మాసనం.. 'కేవలం పిటిషన్‌ను మాత్రమే విచారిస్తాం, బెయిల్ ఇస్తామని చెప్పడం లేదు. చివరకు బెయిల్ ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు' అని తెలిపింది. ఇందుకు సంబంధించి వాదనల కోసం సిద్ధమై రావాలని ఈడీకి సుప్రీం ధర్మాసనం సూచించింది.



## మరో నాలుగు రోజులు వడగాలులే

### తెలుగు రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక

**ముందడుగు తెలంగాణ:**

సూర్య భగవానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమంటుంటే గత రెండు రోజులుగా వడగాలులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పగలు 10 గంటలు దాటితే బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత కూడా వేడిగాలి సెగలు రేపుతోంది. పిల్లలు, వృద్ధులూ వడగాడ్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వడగాల్పుల ప్రభావం కొనసాగుతుందని మిగతా 2లో




మాట నిలబెట్టుకుంటే రేవంత్‌రెడ్డికి సన్మానం చేస్తా

వివరాలు 2లో

## హైదరాబాద్ మెట్రోలో 50 కోట్ల మంది తిరిగారు

### మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

వివరాలు 4లో



30 ఏళ్లు దాటితే మీ వెన్నముక భద్రం..

వివరాలు 4లో

ప్రపంచంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్లు ఏపీలో 4లో

ముందడుగు
శనివారం, 04-5-2024, హైదరాబాద్

# మాట నిలబెట్టుకుంటే రేవంత్‌రెడ్డికి సన్మానం చేస్తా

## ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేయాలి • బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యలు

**ముందడుగు సిద్దిపేట:**

ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేస్తే సిద్దిపేటలో రేవంత్‌రెడ్డికి సన్మానం చేస్తానని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని పంద్రాగస్టు లోగా కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేస్తే రాజీనామా చేస్తానని పునరుద్ఘాటించారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ అయ్యిందని వ్యాఖ్యానించిన ఆయన.. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే సీఎం రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఆ గడువు దాటిపోయినా పత్తా లేదని, ఇప్పుడు ఆగస్టు 15లోగా చేస్తామని చెబుతున్నారని హరీశ్ విమర్శించారు. '' పదవుల కోసం చిల్లర రాజకీయాలు చేయడం నాకు అలవాటు లేదు. రాష్ట్రాన్ని తెచ్చింది సిద్దిపేటనే. తెలంగాణ రావడానికి కారణం కేసీఆర్. తెలంగాణకు, కేసీఆర్‌కు.. రేవంత్‌రెడ్డి రుణపడి ఉండాలి. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని రేవంత్ చెప్పడం పచ్చి అబద్ధం. అది ప్రజలందరికీ తెలుసు'' అని హరీశ్‌రావు అన్నారు.



# మరో నాలుగు రోజులు వడగాలులే

## తెలుగు రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

ఐఎండీ హెచ్చరించింది. ఇక తూర్పు ప్రాంతంలో వడగాలులు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కుమార్ హెచ్చరించారు. ఒడిషా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో తీవ్ర వడగాలులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మూడు రోజుల తర్వాత ఉరుముల కారణంగా వేడి గాలుల తీవ్రత తగ్గుతుందని అన్నారు. ఇక అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాంలో రెండు రోజుల తర్వాత భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు.

# హైదరాబాద్ మెట్రోలో 50 కోట్ల మంది తిరిగారు

## మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడి

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ మహానగరంలో ప్రజాదరణ చూరగొంటున్న హైదరాబాద్ మెట్రో..మరోఘనతను దక్కించుకుంది. తాజాగా 50 కోట్ల ప్రయాణికుల మైలురాయిని దాటింది. ఈ మేరకు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. గ్రీన్ మైల్స్ లాయల్టీ క్లబ్‌ను ఆవిష్కరించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెట్రోపై ప్రయాణికులకు నమ్మకం పెరిగిందని చెప్పారు. మెట్రో రైలు వల్ల 14.5 కోట్ల లీటర్ల ఇంధనం ఆదా అయ్యిందని, ప్రతి రోజూ సగటున 5.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. రెండో దశ మెట్రోరైలుకు కూడా ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధమైనట్లు తెలిపారు.

# ప్రపంచంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్లు ఏపీలో

- వాళ్లు ఏ బ్రాండ్ పెడితే అవే తాగాలట
- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**ముందడుగు కడప:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిరుద్యోగుల కోసం సంక్రాంతికి జాబ్ క్యాలెండర్ ఇస్తామని గతంలో జగన్ హామీ ఇచ్చారు. కాని ఇప్పుడు ఆ ఉద్యోగాలెక్కడని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక 5 సంక్రాంతులొచ్చాయి.. ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ఒక్క జాబ్ క్యాలెండర్ అయినా వచ్చిందా? అని నిలదీశారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. ''పూర్తి మద్యపాన నిషేధమన్నారు.. ఏమైంది? జగన్ సర్కారే మద్యం అమ్ముతోంది. వాళ్లు ఏ బ్రాండ్ పెడితే అవే తాగాలట. ప్రపంచంలో ఎక్కడా లేని మద్యం బ్రాండ్లు ఏపీలో పెట్టారు. ప్రజలు నాసిరకం లిక్కర్ తాగి కిడ్నీలు దెబ్బతిని చనిపోతున్నారు. ఏపీలో ఎక్కడ చూసినా మాఫియాలే. వేల కేజీల్లో డ్రగ్స్ కంటైనర్లలో వస్తున్నాయి'' అని షర్మిల ఆరోపించారు.



# ఆస్తి కోసం భర్తను హింసించిన భార్య

## ఇంటిముందే గొలుసులతో కట్టేసిన వైనం

**ముందడుగు మేడ్చల్:**

ఆస్తి కోసం కట్టుకున్న భర్తను గొలుసులతో కట్టేసి భార్య హింసించిన దారుణ సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పత్తి కృష్ణ(50), భారతి (45) దంపతులు అంబేద్కర్ నగర్‌లో నివాసముంటున్నారు. రెండు ఫ్లాట్ల విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. భార్యతో పడలేని కృష్ణ సంవత్సరం క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. కృష్ణ ఆచూకీ తెలుసుకున్న భార్య భారతి మూడు రోజుల క్రితం అతడిని పట్టుకొచ్చి గొలుసులతో కట్టి ఇంట్లో బంధించింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెళ్లి కృష్ణను విముక్తి చేశారు. కాగా, 3 రోజుల నుంచి తనను కొడుతూ బాధలు పెట్టారని పోలీసుల ముందు బాధితుడు బోరున ఏడ్చాడు.

# సెల్‌ఫోన్ టార్చ్ లైట్ వెలుగులో సిజేరియన్

- వైద్యం వికటించి తల్లీబిడ్డ మృతి
- ఆసుపత్రిలో ఆక్సిజన్ అందుబాటులో లేని వైనం



**ముందడుగు ముంబాయి:**

చిమ్మ చీకట్లో సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుగులో వైద్యులు చేసిన సిజేరియన్ తీవ్ర వేదన మిగిల్చింది. ఆసుపత్రి నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలి అయ్యాయి. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖుస్రుద్దీన్ అన్సారీ అనే వ్యక్తి ఇటీవల నిండు గర్భిణీగా ఉన్న తన భార్యను సుష్మా స్వరాజ్ మెటర్నిటీ హోంలో చేర్పించారు. కరెంట్ పోయినా.. ఇతర ఏర్పాట్లు చేయకుండానే టార్చ్‌లైట్ వేసి, వైద్యులు ఆపరేషన్ చేశారని, దాంతో తల్లీబిడ్డ మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆ ఆసుపత్రిలో కనీసం ఆక్సిజన్ కూడా అందుబాటులో లేదని చెప్పారు.

ముందడుగు
శనివారం, 04-5-2024, హైదరాబాద్

# కాంగ్రెస్ కంచుకోటను వదులుకున్న గాంధీలు

### 31 ఏళ్లు అమేఠీ స్థానానికి వాళ్లదే ప్రాతినిధ్యం

**ముందడుగు జాతీయం:**

కాంగ్రెస్ పార్టీకి, గాంధీల కుటుంబానికి కంచుకోటగా ఉండే అమేఠీ లోక్‌సభ స్థానం 25 ఏళ్ల తర్వాత గాంధీల నమ్మకస్థుడైన కిశోరీ లాల్ భుజానెత్తింది. అలా పాతికేళ్ల తర్వాత తొలిసారి గాంధీ కుటుంబేతర వ్యక్తి ఇక్కడ పోటీకి దిగినట్లయ్యింది.



**కాంగ్రెస్ కంచుకోటకు బీటలు**

గత నాలుగున్నర దశాబ్దాల్లో దాదాపు 31 ఏళ్లు అమేఠీ లోక్‌సభ నియోజకవర్గానికి గాంధీ కుటుంబసభ్యులు ప్రాతినిధ్యం వహించారు. 1980లో తొలిసారి సంజయ్ గాంధీ ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆయన ఆకస్మిక మరణంతో మరుసటి ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో రాజీవ్ గాంధీ బరిలోకి దిగారు. అప్పటి నుంచి 1991 వరకు ఆయనే ఎంపీగా కొనసాగారు. ఇక, 1999లో సోనియా గాంధీ పోటీ చేయగా.. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అమేఠీని కుమారుడికి అప్పగించారు. అలా 2004 నుంచి రాహుల్ గాంధీ వరుసగా మూడు సార్లు ఇక్కడ విజయం సాధించారు. కానీ, గత ఎన్నికల్లో బిజెపి నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఆయన ఓటమిపాలవడంతో కంచుకోటకు బీటలుపడ్డాయి.

**ఇన్నేళ్లకు ఇతరులకు అవకాశం**

గాంధీ కుటుంబేతరులు ఈ స్థానం నుంచి పోటీ చేయడం గత మూడు దశాబ్దాల్లో ఇది రెండోసారి. 1991లో రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఈ స్థానాన్ని సతీశ్ శర్మకు అప్పగించింది. ఆ ఉప ఎన్నికల్లో గెలిచిన శర్మ.. 1996లో రెండోసారి విజయం సాధించారు. అయితే, 1998లో మాత్రం భాజపా చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ మరుసటి ఏడాదే మళ్లీ ఎన్నికలు జరగ్గా.. అమేఠీ మరోసారి కాంగ్రెస్ వశమైంది. అప్పటి నుంచి గాంధీ కుటుంబసభ్యులే పోటీ చేయగా.. మళ్లీ ఇన్నేళ్లకు ఇతరులకు అవకాశమిచ్చారు. తాజా ఎన్నికల్లో అమేఠీ నుంచి కిశోరీ లాల్ శర్మను నిలబెట్టారు.

# రాష్ట్రంలో 46 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు

- భానుడి భగభగకు తల్లడిల్లుతున్న ప్రజలు
- సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 46.7 డిగ్రీలు

**ముందడుగు తెలంగాణ:**




తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. మండుటెండలకు ఉక్కపోత కూడా తీవ్రమైంది. దీంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం రాష్ట్రంలో 46 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో 46.7, జగిత్యాల జిల్లాలోని నేరెళ్లలో 46.7, సూర్యాపేట జిల్లాలోని మునగాలలో 46.7, ఖమ్మం జిల్లాలోని పమ్మిలో 46.7, నల్లగొండ జిల్లా కామారెడ్డిగూడెంలో 46.6, మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్‌లో 46.5, కరీంనగర్ జిల్లాలోని వీణవంకలో 46.5, మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రంలో 46.4, నారాయణపేట జిల్లా ఉట్కూరులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా భానుడు తన ప్రతాపం చూపించాడు. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.7 డిగ్రీలు, నల్లగొండ జిల్లా కామారెడ్డిగూడెంలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మరో 29 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సూర్యాపేట జిల్లాలో 17 ప్రాంతాల్లో, యాదాద్రి జిల్లాలో 6 ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# అమిత్ షా వీడియో మార్ఫింగ్ నిందితులు అరెస్టు

### కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

**ముందడుగు క్రైం:**

అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో ఐదుగురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బిజెపి నేత ప్రేమేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా యూనిట్‌లో పనిచేస్తోన్న పెండ్యాల వంశీకృష్ణ, మన్నె సతీష్, పెట్టం నవీన్, ఆస్మా తస్లీమ్, కోయా గీతలను అరెస్టు చేసి వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు పలు అంశాలను గుర్తించారు. గత నెల



23న మెదక్‌లో అమిత్ షా పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారు. అయితే రిజర్వేషన్లకు సంబంధించి అమిత్ షా మాట్లాడినట్టు మార్ఫింగ్ చేసిన వీడియో ప్రధాన నిందితుడు పెండ్యాల వంశీకృష్ణ వాట్సప్‌కి వచ్చింది. ఆ వీడియోను పలు వాట్సప్ గ్రూప్‌లకు ఫార్వర్డ్ చేయడంతో పాటు, కాంగ్రెస్ అధికారిక ట్విటర్ ఖాతాలో కూడా పోస్టు చేశాడు. మిగిలిన వారు కూడా వారి వ్యక్తిగత ట్విటర్ ఖాతాల్లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలో వాస్తవం లేకపోవడంతో ట్విటర్ దానిని డిలీట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చగా.. ఐదుగురు నిందితులకు రూ.10వేలతో ఇద్దరు పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రతీ సోమవారం, శుక్రవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

# హైదరాబాద్ నగరంలో ప్రారంభమైన ఎస్ ఇన్‌ఫ్రా సేవలు

**ముందడుగు హైదరాబాద్:**

రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకమైన సేవలు అందించేందుకు నగరంలో ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్. లిమిటెడ్ ప్రారంభమైంది, తెలంగాణ 2021 యూత్ ఐకాన్ అయిన డాక్టర్ స్రవంతి ఎల్లసిరి స్థాపించిన ఎస్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రారంభ వేడుక మే 3, 2024న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో జరిగింది. తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త శకానికి నాంది పలికిన ఈ కార్యక్రమంలో ఎస్ ఇన్‌ఫ్రా లోగో ఆవిష్కరణ మరియు కంపెనీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు.




"ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యూహాలలో నైపుణ్యంతో, రియల్ ఎస్టేట్ రంగంలో ఈ కొత్త వెంచర్‌ను ప్రారంభించడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని డాక్టర్ స్రవంతి ఎల్లసిరి అన్నారు. "ఎస్ ఇన్ ఫ్రా నుండి ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు మరియు కమర్షియల్ ప్రాపర్టీస్ తో సహా సమగ్రమైన రియల్ ఎస్టేట్ ఎంపికలను అందించడానికి కట్టుబడి ఉంది అన్నారు, ప్రారంభ వేడుకలో ఎస్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ బొల్లింపల్లి కృష్ణ సాయి, ప్రాజెక్ట్ మేనేజర్ కె. సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ భావన ఎల్లసిరి, బిజినెస్ స్ట్రాటజిస్ట్ ఫణిభూషణ్ కుక్కడపు, ఆసిఫ్ అలీఆరోన్ ఆర్కిటెక్చర్, స్మార్ట్ బ్లూమ్స్ వ్యవస్థాపకుడు ఎన్ ఈశ్వర్ కుమార్ తదితరులు హాజరయ్యారు..

ముందడుగు

శనివారం, 04-5-2024, హైదరాబాద్

# 30 ఏళ్లు దాటితే మీ వెన్నెముక భద్రం..

## ఈ విషయాలపై అవగాహన తెలుసుకోండి..



**ముందడుగు ప్రత్యేకం:**

మన శరీరంలో ఎముకలు చాలా ముఖ్యమైనవి. ఇవి మన శరీర నిర్మాణాన్ని సిద్ధం చేస్తాయి. ఎముకలు బలహీనమైతే.. మన శరీరం నొప్పిని అనుభవిస్తుంది.. విపరీతమైన బలహీనత ఉంటుంది. అంతేకాకుండా.. వెన్నెముక మన శరీరానికి చాలా ముఖ్యమైనది. వెన్నముక శరీరానికి కీలకమైనది.. కానీ 30 సంవత్సరాల తర్వాత అది కొద్దిగా బలహీనంగా మారే అవకాశముంది. అందువల్ల, ఈ సమస్యను నివారించడానికి, మీరు మన వెన్నెముకకు చాలా మేలు చేసే కొన్ని ఆహార పదార్థాలను తినవలసి ఉంటుంది.

### పాల ఉత్పత్తులు..

పాలు, దాని ఉత్పత్తులలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది మన ఎముకల బలానికి చాలా ముఖ్యమైనది. దీని కోసం మీరు పాలు, పెరుగు, జున్ను తినవచ్చు. అయితే.. కొవ్వు తక్కువ ఉన్న పాలు తీసుకోవడం మంచిది.. లేకపోతే అది బరువు పెరిగేలా చేస్తుంది.

### మూలికలు..

30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు మూలికల (వృక్ష వేర్ల భాగములు) తీసుకోవడం పెంచాలి. ఎందుకంటే వాటి ఆయుర్వేద లక్షణాలు మన శరీరానికి, ఎముకలకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. మీరు మీ రోజువారీ ఆహారంలో అల్లం, పసుపు, దాల్చిన చెక్క, అల్లం, తులసిని తప్పనిసరిగా తీసుకోవాలి.. రోజుకు రెండుసార్లు హెర్బల్ టీని కూడా త్రాగాలి.

### ఆకుపచ్చ కూరగాయలు

గ్రీన్ వెజిటేబుల్స్‌ను సూపర్‌ఫుడ్ అంటారు. ఎందుకంటే వాటిలో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తాయి. బ్రకోలీ, కేల్, బచ్చలికూరలను రెగ్యులర్ డైట్ లో చేర్చుకుంటే వెన్ను మంట ఆగి, వెన్నునొప్పి సమస్య తలెత్తదు.

## వెన్నెముక బలహీనతను ఎలా గుర్తించాలి?

మన వెన్నెముక బలహీనంగా మారడం ప్రారంభించినప్పుడు.. నడుము నొప్పి, మెడ నొప్పి, వెన్నునొప్పి, తుంటి నొప్పి, నడవడంలో ఇబ్బంది వంటి సమస్యలను ఎదుర్కొనే అవకాశముంది. చాలా సందర్భాలలో చేతులు, కాళ్ళు తిమ్మిరి లాంటి లక్షణాలు కూడా గమనించవచ్చు. అటువంటి పరిస్థితిలో మీ వయస్సు 30 సంవత్సరాల కంటే తక్కువ ఉంటే, వెన్నెముకను బలోపేతం చేయడానికి మీరు మొక్కల ఆధారిత ప్రోటీన్ తీసుకోవడం పెంచాలి. మాంసాహారం తినడం వల్ల ప్రోటీన్ల అవసరం తీరిపోయినా, దీనివల్ల స్థూలకాయం, కొలెస్ట్రాల్ పెరుగుతాయనే భయం ఉంటుంది.





# జెడీ గెలుపు ఖాయం..?

## ప్రచారంలో పెంచిన వేగం • బ్రహ్మరథం పడుతున్న ఓటర్లు

**ముందడుగు విశాఖపట్నం**

ఉత్తర విశాఖలో జై భారత్ పార్టీ అధ్యక్షుడు, ఉత్తర విశాఖ ఎమ్మెల్యే అభ్యర్థి జెడీ లక్ష్మినారాయణ గెలుపు ఖాయమని ఓటర్లు అంటున్నారు. సిబిఐ జాయింట్ డైరెక్టర్ గా పనిచేసినప్పుడు అవినీతి పరుల గుండెల్లో సింహస్వప్నంగా మారారని, అలాంటి నాయకుడు ఎమ్మెల్యేగా గెలిస్తే అవినీతి రహిత సమాజ పాలన సాధ్యమవుతొందని నియోజవర్గ ఓటర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నియోజకవర్గం లోని నర్సింహసాగర్, సాయినగర్ ప్రాంతాల లో ఓటర్లతో ముఖాముఖిగా కలుస్తూ ప్రచారం చేశారు. సాయంత్రం అక్కయ్యపాలెం, తాడిచెట్లపాలెంలో ర్యాలీ నిర్వహించారు.

### నాయకులు ఎండల్లోనే తిరగాలి

ప్రజల కోసం పనిచేసే నాయకులు అనునిత్యం ప్రజల కోసం, ప్రజల తోటి ఎండల్లోనే తిరగాలని జెడీ లక్ష్మినారాయణ అన్నారు. ప్రజలు కష్టపడుతుంటే నాయకులు ఏసీల్లో కూర్చోకూడదని, అలాంటి నాయకులకు ప్రజల కష్టాలు, కన్నీళ్లు ఏలా తెలుస్తాయని అన్నారు. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసేలా జై భారత్ పార్టీ తరపున రంగంలోకి దిగామని అన్నారు.

### జై భారత్ పార్టీకి పట్టం కట్టండి

రాష్ట్రంలో ఉన్న రెండు పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలకే సమయం సరిపోతుందని ఇంక ప్రజల సమస్యలకు వారికి టైం ఎక్కడిదని ఆయన అన్నారు. మీతో ఉంటూ, మీలో ఒకరిగా ఉంటే జై భారత్ పార్టీ అభ్యర్థిని అయినా నన్ను గెలిపించాలని ఆయన అన్నారు. రాబోయే తరాల కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఆలోచించాలని కోరారు.





## నా బాడీ సూపర్‌డీలక్స్ అంటున్న ఆషురెడ్డి

రోటిన్ పాత్రలకు భిన్నంగా కొత్త పాత్రల్లో నటించినప్పడే కెరీర్‌లో కిక్ వుంటుంది. సరిగ్గా అలాంటి ఓ డిఫరెంట్ అండ్ బోల్డ్, హాట్ పాత్రలో త్వరలో యేవమ్ చిత్రంలో కనిపించబోతున్నారు ఆషు రెడ్డి. హారిక అనే ముఖ్యపాత్రలో ఆమె నటిస్తున్న చిత్రం యేవమ్.. ఈ చిత్రంలోని నా బాడీ సూపర్‌డీలక్స్ అంటూ ఆషురెడ్డి కిక్ ఇచ్చే పాత్రలో ఎందుకు కనిపించబోతున్నారు తెలియాలంటే యేవమ్ విడుదల వరకు ఆగాల్సిందే. చాందిని చైదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి ముఖ్యతారలుగా రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రకాష్ దంతులూరి దర్శకుడు. నవదీప్, పవన్ గోపరాజు నిర్మాతలు. శుక్రవారం ఆషు రెడ్డి పాత్రకు సంబంధించిన లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ మహిళా సాధికారికతను చాటి చెప్పే నేపథ్యంలో ఈ సినిమా వుంటుంది. దర్శకుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ ఇటీవల విడుదల చేసిన చాందిని చౌదరి పోస్టర్‌లో వున్న 'ఆడపిల్లని అయితే ఏంటంటా? అనే రైటప్ అందర్ని ఆలోచింపజేసింది. ఇప్పుడు ఆషు రెడ్డి నా బాడీ సూపర్ డీలక్స్ అని ఎందుకు అంటుంది. ఇలా ప్రతి పాత్రకు ఒక మార్క్ వుంటుంది. కొత్త కంటెంట్‌తో పాటు ఎంతో డిఫరెంట్ నేరేషన్‌తో ఈ సినిమా వుంటుంది. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం వుంది' అన్నారు.



## 10న లక్ష్మీ కటాక్షం

మహతి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ నుండి యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కే. పురుషోత్తం రెడ్డి నిర్మించిన 'లక్ష్మీ కటాక్షం' డైలాగ్ పోస్టర్ & ట్రైలర్ విడుదల అయ్యి ప్రేక్షకుల నుండి విశేష ఆదరణ పొందిన సంగతి అందరికీ తెలిసిందే. పొలిటికల్ సేటైరికల్ డ్రామా తో వచ్చిన ఈ 'లక్ష్మీ కటాక్షం' కాన్సెప్ట్ తనకంటూ ఒక మార్క్ క్రీయేట్ చేసుకుంది. ఓటర్లే వారి ఓటుకు ఒక రేటు ఫిక్స్ చేసుకుని నాయకులని ముప్ప తిప్పలు పెడుతూ డ్రామా తో పాటు, హాస్యం రెండు కలగలిపిన కథ 'లక్ష్మీ కటాక్షం'. ఒక పక్క రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నికల హోరు ఇంకో పక్క ఆ ఎన్నికలకే సెటైరికల్ గా వస్తున్న 'లక్ష్మీ కటాక్షం' U/A సర్టిఫికెటును తెచ్చుకొని మే 10న థియేటర్లలో రిలీజ్ కాబోతుంది.